సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 23 । జనవరి । 2024



చేతిరాతకు పదును పెడదాం

విద్యార్థి కెరీర్‌లో మంచి చేతిరాత చాలా ముఖ్యం. అందువల్ల చేతిరాతను మెరుగు పరుచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. - 10లో



మహిళలకు ఆపన్నహస్తం

ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తం అందిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



అతివలకు ఆసరా

పాదయాత్రలో అక్క చెల్లెమ్మల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మహిళాభ్యుదయం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే వారి కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలులోకి తెచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఈమేరకు ఇప్పటికే మూడు విడతల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నిధులను విడుదల చేశారు. తాజాగా మంగళవారం నాలుగో విడత విడుదల చేయనున్నారు. తద్వారా ప్రభుత్వం మహిళా సాధికారతే ధ్యేయంగా అడుగులు వేస్తోందనే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

- సీఎం వైఎస్ జగన్ చెప్పిన మేరకు హామీల అమలు
- జిల్లాలో 24,948 ఎస్‌హెచ్‌జీలకు నాలుగో విడత సొమ్ములు
- జిల్లాకు రూ. 223.11 కోట్ల లబ్ధి

వైఎస్సార్ ఆసరాకు సంబంధించిన సమాచారం

విడతలు	ఎస్‌హెచ్‌జీ గ్రూపులు	లబ్ధి మొత్తం (రూ. కోట్లలో)
మొదటి విడత	22.168	198.17
రెండో విడత	22229	197.48
మూడో విడత	22214	198.52
నాలుగో విడత	24948	223.11



స్వయం సహాయక మహిళా సంఘం

సాక్షి రాయచోటి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్కచెల్లెమ్మల రుణం తీర్చుకుంటోంది. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి వారికి ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా బలోపేతం చేస్తూనే, వారు నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తున్నారు. అన్ని విషయాల్లోనూ వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తూ వారి మనసుల్లో సీఎం చెరగని ముద్ర వేసుకుంటున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత లాంటి పథకాలతో అండగా నిలిచిన ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీలో భాగంగా మరో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ముల విడుదలకు నడుం బిగించింది. అందులో భాగంగా శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో సొమ్ములు జమ చేసేందుకు సిద్ధమైంది.

జిల్లాలో 24,948 గ్రూపులకు ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో ఉన్న డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యులందరికీ ప్రయోజనం ఒనగూరేలా ప్రభుత్వం పథక రచన చేసింది. **ప్రతిపక్ష నేత** హోదాలో పాదయాత్ర సందర్భం**గా వైఎస్ జగన్** మోహన్‌రెడ్డి అప్పట్లో ఎన్నికల నాటికి తీసుకున్న డ్వాక్రా రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని ఇచ్చిన మాట మేరకు హామీ నెరవేరుస్తున్నారు. జిల్లాలోని 24,948 గ్రూపుల్లోని సభ్యులందరికీ సుమారు రూ. 223.11 కోట్ల మేర నిధులను విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా ఉరవ**కొండలో నిధులను విడుదల చేయనున్నారు**. రాష్ట్ర**వ్యాప్తంగా మహిళలందరికీ వైఎస్సార్** ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత సొమ్ములను మంగళవారం ఖాతాలకు జమ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో మూడు విడతల్లో సుమారు రూ. 600 కోట్లు మహిళలకు సొమ్ములు అందించారు. జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నాలుగో విడత సొమ్ములను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా విడుదల చేయనున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



జిల్లాలో మహిళలందరూ కూడా ఆర్థికంగా రాణించాలి. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సొమ్ములను సద్వినియోగం చేసుకోవాలి. వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా మహిళలకు పెద్ద ఎత్తున సాయం అందుతోంది. ఒక్క అన్నమయ్యజిల్లాకు సంబంధించి రూ. 223.11 కోట్ల మేరకు నిధులు విడుదల చేయనున్నారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాట పట్టాలి.

– ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జాయింట్ కలెక్టర్, అన్నమయ్య జిల్లా

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ శ్రీలేఖలు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.వీటిని నిర్ణీత గడువు లోపు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

స్పందన విజ్ఞప్తులు....

పీలేరు మండలం, బోడేవారిపల్లికి చెందిన ఎస్ నిర్మల నిరుపేదలైన తమ కుటుంబానికి ఇళ్లు లేదని, ఇంటిస్థలం, ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. నందలూరు మండలం, ఆడపూరుకు చెందిన గ్రామ రైతులు గ్రామంలోని గుంత చేలు పొలానికి వెళ్లేందుకు దారులు, పంట కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణలపై విచారణ చేసి తమ పొలాలకు దారి సమస్య, పంట కాలువల నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. వీరబల్లి మండలం, పెద్దివీడుకు చెందిన సి వెంకటలక్షుమ్మ (73) వృద్ధురాలినైన తమకు ఎలాంటి ఆధారం లేదని కావున తమకు వృద్ధాప్య, వితంతు పెన్షన్ మంజూరు చేయించాలని విన్నవిస్తూ జాయింట్ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.



ప్రజల వినతులను స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితరులు

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

స్థానిక పోలీసే పేరెడ్ మైదానంలో ఈ నెల 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగా వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖల ఏర్పాటు చేసి శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రాజ కమల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని పరెడ్ మైదానంలో పోలీస్‌శాఖ తరపున చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, ఎస్‌డీసీ శ్రీలేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు

రాయచోటి : జిల్లా పరిధిలో ఇంటర్మీడియట్ విజేత పాటు ఉన్నత విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంటర్ బోర్డు కమిషనర్ సౌరవ్ ప్రిన్సిపాళ్లకు సూచించారు. సోమవారం రాయచోటిలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను ఆర్జేడీ రవి, డీఐఈఓ కృష్ణయ్యలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. జిల్లా ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా ఇంటర్ పరీక్ష పత్రాలను దిద్దే కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు ప్రశ్నపత్రాలు దిద్దడంలో కూడా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పనులపైన ప్రత్యేక దృష్టి సారించి భవనాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు.



మాట్లాడుతున్న సౌరవ్

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

రాయచోటి టౌన్ : స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై స్పందించాలని, గడువులోపు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 43 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిని ఇచ్చిన గడువులోగా పరిష్కరించి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అలాగే నివేదికలు ఎప్పటికప్పుడు జిల్లా ప్రధాన కార్యాలయానికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాచపల్లెలో పశు విజ్ఞానబడి



మాట్లాడుతున్న గుణశేఖర్ పిళ్లై

రామాపురం : మండలంలోని రాచపల్లె గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో సోమవారం అన్నమయ్య జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా చనిపోతున్న ఆవుల వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు డా.డి.మాలకొండయ్య, మండల పశువైద్యాధికారి డా.కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కార్యకర్తల తొలగింపునకు చర్యలు

రాయచోటి టౌన్ : విధులకు హాజరు కాని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల తొలిగింపునకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శశికళ తెలియచేశారు. జిల్లా వ్యాప్తంగా 2275 మంది అంగన్ వాడీ కార్యకర్తలు, 1795 మంది హెల్పర్లు ఉండగా వారిలో 2207 సమ్మెలో ఉన్నారని చెప్పారు. వీరిలో సోమవారం 545 మంది కార్యకర్తలు, 407 హెల్పర్లు విధుల్లో చేరారన్నారు. విధుల్లో చేరని వారు 1662 మంది కార్యకర్తలు, 1381 మంది హెల్పర్లు ఉన్నట్లు వివరించారు. వీరిలో 129 మంది కార్యకర్తలు, 21 మంది హెల్పర్లను విధుల నుంచి తొలిగించినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



రాయచోటి అర్బన్ : ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రెడ్డిపద్మజ సోమవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, ఏపీ వేర్‌హౌస్ కార్పొరేషన్ ఎండీ ఓంకార్‌రెడ్డిలు ఆమెకు శాలువా కప్పి పూలబొకేతో సన్మానించారు. రెడ్డిపద్మజ సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత బరుగు రెడ్డెన్న కుమార్తె.

నూతన కార్యవర్గాల ఎన్నికకు ఆమోదం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం తాలూకా యూనిట్లు, పరిషత్తు యూనిట్, జిల్లా యూనిట్ల పదవీకాలం ముగిసిందని ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా మల్లేశ్వరరెడ్డి తెలిపారు. అయితే సదరుస్థానంలో నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడానికి రాష్ట్ర సంఘం ఆమోదం తెలిపిందన్నారు. దీంతో జిల్లాలో సంఘం ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందువల్ల పీఆర్ ఉద్యోగులు సంబంధిత తాలుకా, పరిషత్ యూనిట్లతో సభ్యులుగా నమోదు చేసుకొని ఎన్నికలకు సన్నద్ధం కావాలని కోరారు.

ఎల్ఎస్ఎస్‌గా పదోన్నతులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో సోమవారం ఎంఎస్‌డబ్ల్యూ (మెడికో సోషల్ వర్కర్) గ్రేడ్–2 నుంచి లెక్చరర్ ఇన్ సోషల్ సైన్సెస్ (ఎల్ఎస్ఎస్)గా పదోన్నతులు కల్పించారు. మొత్తం ఐదుగురికి ఎల్ఎస్ఎస్‌గా పదోన్నతులు కల్పించి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ అధికారుల ఆదేశాలు, నిబంధనల ప్రకారం ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య, వనీష తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు



కూరగాయలు విక్రయిస్తున్న సభ్యులు

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు విక్రయించేందుకు కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రజలకు సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా పండిన పంటలను పరిచయం చేయడానికే ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా పథకం మేనేజర్ రామకృష్ణంరాజు సోమవారం తెలిపారు. కూరగాయలు, పండ్లను రైతుల నుంచి నేరుగా సేకరించి విక్రయిస్తున్నామని, దీనివల్ల రైతులకు అధిక లాభాలు వస్తున్నాయని చెప్పారు.అలాగే ప్రజలకు తక్కువ ధరకే విక్రయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను తిని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈ. పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

జిల్లాలో 14,02,808 మంది ఓటర్లు

రాయచోటి : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో 14,02,808 మంది ఓటర్లతో తుది జాబితాను ప్రచురించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియలో భాగంగా మొత్తం 14,02,808 మందితో పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా రూపొందించినట్లు చెప్పారు. ఇందులో పురుష ఓటర్లు 6,89,346 మంది, మహిళా ఓటర్లు 7,13,326 మంది, థర్డ్ జెండర్ 136 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు సర్వీస్ ఓటర్లు 1287 మంది ఉన్నారని, ఇందులో పురుషులు 1263, స్త్రీలు 24 మంది ఉన్నట్లు చెప్పారు. తుది జాబితాను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటరు నమోదు అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయాలలో, పోలింగ్ కేంద్రాలలో ప్రచురించినట్లు చెప్పారు.ఇందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 7, 8లలో, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం–6లో దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఎక్కువ : తుది ఓటరు జాబితా ప్రకటనలను అన్నమయ్య జిల్లాలో మహిళా ఓటర్ల ప్రభావం కనిపిస్తోంది. పురుషుల కంటే మహిళలు సంఖ్య ప్రతి నియోజకవర్గంలోనూ అధికంగా కనిపించింది.

నియోజకవర్గ వారీగా తుది ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
125–రాజంపేట	115594	121424	10	237028
127–కోడూరు(ఎస్సీ)	99351	102176	17	201544
128–రాయచోటి	123836	126512	26	250374
162–తంబాలపల్లి	109219	112418	10	221647
163–పీలేరు	114022	118397	16	232435
164–మదనపల్లి	127324	132399	57	259780

సర్వీసు ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
125–రాజంపేట	158	5	163
127–కోడూరు(ఎస్సీ)	112	4	116
128–రాయచోటి	253	1	254
162–తంబాలపల్లి	175	1	176
163–పీలేరు	396	6	402
164–మదనపల్లి	168	7	175

• రాజీవలోచన..కౌసల్యనందన..

శ్రీరాముడు..భక్తుల ఆరాధ్యదేవుడు..ఊరూరా కొలువై పూజలందుకుంటున్నాడు. జన్మస్థలపమైన అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నీలమేఘశ్యామున్ని స్మరించుకున్నారు. శ్రీరామ జెండాలతో బైక్‌ర్యాలీ నిర్వహించారు.అయోధ్య ఉత్సవాన్ని తిలకించదానికి పలుచోట్ల భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై శ్రీరామ విగ్రహ ప్రతిష్టను తిలకిస్తూ భక్తులు ఆనంద పారవశ్యంతో రాజీవలోచన..కౌస్యలనందన శ్రీరామ అంటూ నినాదాలు చేశారు. మరి కొందరు జగదభిరాముడిని స్తుతిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. – సాక్షి నెట్‌వర్క్



కడపలో బాలరాముని విగ్రహ ప్రతిష్టను ఎల్ఈడీ స్క్రీన్‌పై చూస్తున్న భక్తులు



రామయ్యా..కరుణ చూపవయ్యా అంటూ మొక్కుకుంటున్న భక్తులు



రామసముద్రంలో శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గుర్రంకొండలో రాముడు, ఆంజనేయుడు, సీత వేషధారణలో చిన్నారులు



కడప : పాలకొండల వద్ద ఉన్న నగరవనం కొండపై రామజ్యోతికి భక్తుల పూజలు

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

చింతకొమ్మదిన్నె : మండలంలోని చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన గజ్జల బావరెడ్డి గారి సుబ్బారెడ్డి అనే వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు, ఐదువేల రూపాయలు జరిమానా ఎక్సైజ్ కోర్టు విధించినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 2019 వ సంవత్సరంలో ఆటోను నిర్లక్ష్యంగా తోలి రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో గజ్జల ఓబుల్ రెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు రుజువు కావడంతో ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి జానకిరామ్ ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు




తీవ్రంగా గాయపడిన గోపాలక్రిష్ణ, నరేష్

అట్లూరు : మండల పరిధిలోని కడప – బద్వేలు ప్రధాన రహదారిపై రెడ్డిపల్లె వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండల పరిధిలోని గుజ్జలవారిపల్లె గ్రామానికి చెందిన గోపాలక్రిష్ణ, నరేష్‌లు ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం రెడ్డిపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా పాల ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాలక్రిష్ణ, నరేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వడంతో వారిని కడప రిమ్స్‌కు తరలించారు.

చేతిరాతకు పదును పెడదాం

నేడు జాతీయ చేతిరాత దినోత్సవం



రాజంపేట రూరల్ : విద్యార్థి కెరీర్‌లో మంచి చేతిరాత చాలా ముఖ్యం. చేతిరాత బాగుంటే మంచి మార్కులు వస్తాయి. కొన్నిసార్లు చేతిరాత సరిగా లేకుంటే సమాధానం సరైనదే అయినా మార్కులు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల చేతిరాతను మెరుగుపరుచుకునేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- రోజూ కొంత సమయం చేతితో ఏదో ఒకటి రాయాలి. ఇలా చేయడం వల్ల రాత మెరుగుపడేందుకు దోహదం చేస్తుంది.
- విద్యార్థులు పెన్ను ఎలా పట్టుకోవాలో కొన్ని చిట్కాలు పాటించాలి. పిల్లలు హోంవర్క్ చేసేటప్పుడు, రాసేటప్పుడు సరిగ్గా కూర్చోవాలని చెబుతున్నారు.
- కూర్చునే భంగిమ కూడా చేతిరాతను ప్రభావితం చేస్తుంది. రాయడానికి నిటారుగా కూర్చోవాలి. లేకపోతే మణికట్టుకు బదులు వేళ్లపై ఒత్తిడి పడుతుంది.
- పెన్ను ఎంచుకోవడం చాలా అవసరం. ఇది పిల్లలకు వారి రచనపై మరింత నియంత్రణ ఇస్తుంది. రాసేటప్పుడు పేపర్ అడుగున ప్యాడ్ ఉంచాలి. నిదానంగా, తొందరపడకుండా, ప్రశాంతంగా రాస్తే చేతిరాత బాగుంటుంది.
- చేతి రాత మనిషి నుదిటిపై దేవుడు రాసిన రాతను తెలియజేస్తుందని పురాణాలు తెలియజేస్తున్నాయి. కంప్యూటర్ యుగంలోను చేతిరాతకు విశిష్టత ఉందని పరిశోధకులు పేర్కొంటున్నారు. అందమైన చేతి రాతను శాస్త్రీయ పద్ధతి ప్రకారం స్ట్రోక్స్‌తో సాధన చేయడం వలన విద్యార్థులు చదువులో, పరీక్షలలో మంచి మార్కులు సాధించవచ్చని వారంటున్నారు. వ్యక్తిలోని నిర్లక్ష్యాన్ని, కోపాన్ని, సోమరితనాన్ని, సృజనాత్మకతను, పట్టుదలను, కోరికలను చేతిరాత ద్వారా అంచనా వేసే పద్ధతే గ్రాఫాలజీ. చేతిరాతలోని అక్షరాలు, వాటి పరిమాణం, అక్షర నిర్మాణం, రాసే పంక్తులకు ఇవ్వాల్సినంత దూరాన్ని పాటిస్తే ఎవరి చేతరాత అయినా చూసేందుకు అందంగా, అర్థవంతంగా ఉంటుందనేది పరిశోధకుల అభిప్రాయం. మన సంతకం ద్వారా కూడా వ్యక్తిత్వాన్ని గ్రాఫాలజీ గుర్తిస్తుంది. అనేకమైన మార్పులను మన చేతిరాతలో తీసుకున్నప్పుడు మనం కూడా ఆలోచనా విధానాన్ని మార్చుకోవచ్చని నూతన పరిశోధకులు సైతం వెల్లడిస్తున్నారు.

చేతిరాతపై మీ అందమైన భవిష్యత్తు



మీ చేతిరాత మీ అందమైన భవిష్యత్తును తెలియజేస్తుంది. ప్రత్యేకంగా సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీలేదు. పరీక్షల్లో మార్కులు చేతిరాత మీదే ఆధారపడి ఉంటాయి. ఈ విషయంలో విద్యార్థులు శ్రద్ధ వహిస్తే వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేస్తుంది. నేను కొన్ని వేల మందికి చేతిరాతపై శిక్షణ ఇచ్చాను. అది వారికి ఎంతో ఉపయోగపడింది.

-డాక్టర్ కాశీగారి ప్రసాద్, చేతిరాత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రాజంపేట

పేద ప్రాణం.. పెద్ద రోగం

- నాలుగేళ్లుగా కాలేయ వ్యాధితో ఇబ్బందులు
- చికిత్స చేయించుకోలేని ఆర్థిక దైన్యం
- ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని వేడుకోలు



తన బిడ్డలతో మోడపోతుల నరసింహులు

ఓబులవారిపల్లె : రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి వారిది.. కూలిపనులు చేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్న చిట్వేలి మండలం , కేఎస్ అగ్రహారం దళితవాడకు చెందిన మోడపోతుల నరసింహులుకు కాలేయ వ్యాధి సోకడంతో చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. నరసింహులుకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం కాలేయానికి సంబంధించిన వ్యాధి సోకింది. చికిత్స చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో ఇంట్లో బంగారు, మేకలు, అన్నీ అమ్మి తిరుపతి, తదితర నగరాల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకుండా పోయింది. శాశ్వతంగా వ్యాధి నయం కావాలంటే లక్షల రూపాయలతో కూడుకున్న పని. ప్రైవేటు ఆసుపత్రిలో చేరి లక్షలు ఖర్చుపెట్టే స్థోమత లేదు. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో కష్టాలు ఎక్కువ అయ్యాయి. ఏడాది నుంచి మంచానికే పరిమితం కావడంతో భార్య కూడా తనను వదిలి వెళ్లిపోయింది. ప్రస్తుతం నలుగురు పిల్లలను పోషించుకోలేక, చికిత్స చేయించుకోలేక మృత్యువుతో పోరాడుతున్నాడు. తన దీనస్థితి గురించి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశాడు. దాతలు తనకు వైద్యానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

20 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు

మదనపల్లె: హంద్రీనీవా కాలువ సమీపంలో పేకాట ఆడుతూ, పోలీసులను చూసి పారిపోయిన 20 మంది నిందితులను వాహనాల ఆధారంగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. సోమవారం ఆయన తాలూకా పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ...కొత్తపల్లె పంచాయతీ హంద్రీ నీవా కాలువ సమీపంలో పెద్ద మొత్తంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు తాలూకా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. అయితే పోలీసుల రాకను ముందుగానే పసిగట్టిన పేకాటరాయుళ్లు, తమ ద్విచక్రవాహనాలు వదిలివేసి అక్కడి నుంచి తెలివిగా జారుకున్నారన్నారు. దీంతో వాహనాలను తాలూకా స్టేషన్‌కు తరలించి, నెంబర్ల ఆధారంగా నిందితుల వివరాలు సేకరించామన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.80,400 నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తాలూకా సీఐ శేఖర్, ఎస్‌ఐ సుధాకర్, రవికుమార్‌లను డీఎస్పీ అభినందించారు.

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తం



బాలికతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్/అర్బన్ : ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తం అందిస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని రిమ్స్, వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జడ్జి రిజిస్టర్లను పరిశీలించారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసరమైన స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందిస్తున్నారన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ తదితర టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం జడ్జి బాబా ఫకృద్దీన్ రిమ్స్‌లో పర్యటించి పలు విభాగాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిమ్స్ డాక్టర్ జి.వి. రమాదేవి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర రెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



భర్తతో మృతురాలు సుభాషిణి (ఫైల్)

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో నడివీధి గంగమ్మ వీధికి చెందిన సుంకు సుభాషిణి (43) అనే మహిళ సోమవారం తెల్లవారుజామున కాలిన గాయాలతో ఆమె ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అనుమానాస్పద స్థితిలో శవమై తేలింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ పురుషోత్తం రాజు, ఎస్‌ఐ మధుసూదన్ రావులు ఘటనా స్థలం వద్దకు చేరుకొని మహిళ మృతి చెందిన తీరును పరిశీలించారు. మృతురాలి భర్త సుంకు సుబ్బారావును విచారించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా రామాలయం వద్ద ఆటోలో టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగించేవారమన్నాడు. ఆదివారం సాయంత్రం టిఫిన్ సెంటర్ పెట్టేందుకు రామాలయం వద్దకు చేరుకొని తాము గొడవపడి ఇంటికి వచ్చామన్నాడు. ఇంటి వద్ద కూడా రాత్రి 11 గంటల వరకు గొడవ పడుతూ అలాగే నిద్రపోయామని తెలిపాడు. సోమవారం తెల్లవారుజామున చూసేసరికి తన భార్య ఇంట్లో లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానన్నాడు. ఇంటి ముందరే తన భార్య కాలిన గాయాలతో మృతి చెందడం అనుమానాస్పదంగా ఉందని తెలిపాడు. మృతురాలు సుభాషిణి తనంతట తానే కాల్చుకొని మృతి చెందిందా? లేక భర్త సుబ్బారావు క్షణికావేశంలో చంపి శవాన్ని బయటకు తెచ్చి కాల్చేశాడా? అనే విషయాలపై గ్రామ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిల్లులు లేని రూ. 23 లక్షల నగదు సీజ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం బిల్లులు లేని రూ. 23 లక్షల నగదును రూరల్ పోలీసులు సీజ్ చేశారు.

కొత్తపల్లె సర్కిల్ వద్ద పులివెందుల మండలంలోని తుమ్మలపల్లెకు చెందిన వీరరాఘవరెడ్డి వద్ద రూ. 9.50 లక్షలు, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద కారులో వెళ్తున్న పులివెందులకు చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ. 7.50 లక్షలు, రింగ్‌రోడ్డులోని దువ్వూరు క్రాస్ రోడ్డు వద్ద సీకేదిన్నెకు చెందిన అమీమ్ వద్ద రూ. 6 లక్షల నగదును సీజ్ చేశారు. వీరు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో నగదును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కొండాపురంలో రూ.12.85లక్షలు..

కొండాపురం : మండల పరిధిలోని తాడిపత్రి- కడప జాతీయ రహదారిపై వేర్వేరు చోట్ల పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ముచ్చుమర్రి గ్రామ సమీపంలో కొండాపురం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీ లో నెల్లూరుకు చెందిన ఆర్. నరసింహులు కారులో అనంతపురం నుంచి నెల్లూరు వెళుతుండగా తనిఖీలో రూ 9.70 లక్షలు నగదుకు ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో నగదు సీజ్ చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. అలాగే తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద ఓ వ్యక్తి నుంచి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రూ.3.15 లక్షలు నగదు సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నగదును తిరుపతి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐలు పేర్కొన్నారు.

దువ్వూరులో రూ.22.50 లక్షలు..

దువ్వూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.22.50 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అక్రమంగా డబ్బు తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలసి సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఇడమడక గ్రామ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

నంద్యాల వైపు నుంచి వస్తున్న కారులో తనిఖీ చేయగా కారు డిక్కీలో రూ.22.50లక్షలు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. కారులో వెళుతున్న రావుల నరసింహను విచారించగా హైదరాబాద్ నుంచి అన్నమయ్య జిల్లా పీలేరుకు వెళుతున్నట్లు తెలిపాడని ఎస్‌ఐ చెప్పారు. డబ్బును స్వాధీనం చేసుకుని తిరుపతి ఇన్‌కాం ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి



రాయచోటి పాలిటెక్నిక్‌లో శిక్షణను పరిశీలిస్తున్న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే స్కిల్ హబ్ శిక్షణలను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పాలిటెక్నిక్‌ను అగ్రికల్చర్ అడ్వైజరీ కమిటీ జిల్లా చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అధునాతన టెక్నాలజీతో కూడిన శిక్షణను యువతీ, యువకులకు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం స్కిల్ హబ్‌లో జరుగుతున్న జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న యువతీ, యువకులతో ఆయన మాట్లాడారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో శిక్షణ తీసుకుంటున్న శిక్షకులు చేసిన ప్రాజెక్టు వర్కులన్నీ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, శిక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ములకలచెరువు: ములకలచెరువుకు చెందిన బాలిక అదృశ్యమైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గాయత్రీ కథనం మేరకు.. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండలిపల్లెకు చెందిన వెంకటరమణ గత సంవత్సరం నుంచి మొలకలచెరువులో కాపురం ఉంటున్నాడు. ఇతనితోపాటు ఇద్దరు కుమార్తెలు ఆయనతో ఉంటున్నారు. చిన్న కుమార్తె(15) పనుల మీద బయటకు వచ్చి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్యకేసులో నిందితులకు రిమాండ్

ముద్దనూరు : ఈనెల 15వతేదీన మండలంలోని దేనేపల్లె గ్రామంలో బాలయ్య అనే వ్యక్తి హత్య కేసుకు సంబంధించి నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఒక వర్గానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనే విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది.ఈ నేపథ్యంలో పుల్లయ్య, అంకాలమ్మ, గంగాధర్, శివలు కలిసి బాలయ్యను హత్య చేసినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

మదనపల్లె : మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో మండలంలోని ఓ వ్యక్తికి న్యాయస్థానం 15రోజుల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించిన ఘటన సోమవారం జరిగింది. మండలంలోని రామాచార్లపల్లెకు చెందిన కోసూరు శ్రీనివాసులు(45) మద్యం సేవించి ఆటో నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసును విచారించిన సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్ నిందితుడికి 15రోజుల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను గ్యాస్ కట్టర్లతో బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది



ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డ లారీ డ్రైవర్

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు నాలుగో మలుపు వద్ద సోమవారం మరమ్మతులకు గురైన లారీని మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక వైపు నుంచి ఢీకొన్న లారీని నడుపుతున్న డ్రైవర్ హైజర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న సీకేదిన్నె పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని హైడ్రాలిక్ కట్టర్లతోపాటు స్ప్రెడర్ సహాయంతో డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు.

ఈ విషయమై సీకే దిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో లీడింగ్ ఫైర్ మాన్ అన్వర్ బాషా, సంజీవ రాజు, డ్రైవర్ ఆపరేటర్ గంగాధర్ యాదవ్, ఫైర్ మాన్ మురళీకృష్ణ, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు

మదనపల్లె : మండలంలోని నాటుసారా స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పాలెంకొండ సమీపంలోని చిన్నతిప్పసముద్రం చెరువుకట్ట కింద వాగులో కుటీరపరిశ్రమలా సారా తయారీ జరుగుతోందన్న సమాచారం మేరకు తాలూకా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. నాటుసారా తయారీ భారీ డంపును గుర్తించారు. 5వేల లీటర్ల బెల్లం ఊట, వెయ్యి కిలోల సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, 500 లీటర్ల నాటుసారాను సీజ్ చేశారు. పాలెంకొండకు చెందిన రవి అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై ఎక్సైజ్ యాక్ట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు రవికుమార్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.